## క్లుప్తంగా

### గురుకులంలో వైద్యశిబిరం

**మణుగూరురూరల్:** మండలంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి దగ్గు, జలుబు, జ్వరం వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి శివకుమార్ ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు విద్యార్థినులకు సూచించారు. అలాగే కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కల్పించి విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, రవి, పార్వతి పాల్గొన్నారు.

**కలివేరు గ్రామంలో..**

**చర్లరూరల్:** వైరల్ జ్వరాలు, కాళ్ల నొప్పులతో బాధపడుతున్న కలివేరు గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని దివ్య నయన ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలోని ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలను కట్టుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. అనంతరం వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులను అందజేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ సత్యనారాయణ, హెచ్ఈఓ బాబూరావు, హెల్త్ అసిస్టెంట్లు వేణు, సుజాత, విజయ, లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సోడి స్రవంతి, ఆశా కార్యకర్తలు ఉమాదేవి, లక్ష్మీబాయి, అనూష, వరలక్ష్మి పాల్గొన్నారు.

### వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

**దుమ్ముగూడెం:** మండలంలోని మారాయిగూడెం గ్రామంలో నిర్వహించే సమ్మక్క–సారలమ్మ మినీ మేడారం జాతర వాల్ పోస్టర్‌ను ఎంపీడీఓ ముత్యాలరావు, తహసీల్దార్ చంద్రశేఖర్‌లు సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 27 నుంచి మార్చి 2వ తేదీ వరకు జాతరను నిర్వహిస్తారు. అధికారులు జాతరకు రావాలని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారయణపూర్తి, అపకా వీర్రాజు, శ్రీను, సలీం, వీరభద్రం పాల్గొన్నారు.

### రూ.లక్ష విరాళం

**బూర్గంపాడు:** మండల కేంద్రం బూర్గంపాడులోని గంగా సమేత ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయానికి (శివాలయం) అంజనాపురం గ్రామానికి చెందిన భూక్యా బాల్యా, జామిరి దంపతుల కుమారుడు, కోడలు మోహన్‌రావు, పద్మలు రూ.1లక్ష విరాళం అందజేశారు. సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులకు దాతలు చెక్కును అందించారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో నిర్వహించే శ్రీలక్ష్మి గణపతి హోమం, కల్యాణ మహోత్సవం, అన్నదాన కార్యక్రమాలకు కూడా దాతలు తమవంతు సాయం అందించారు.

### అందని వేతనాలు

**అశ్వాపురం:** మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల నాయకుడు దండి రాములు అన్నారు. మల్లెలమడుగులో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి స్పందించి పంచాయతీ కార్మికులకు మూడు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

### జయప్రదం చేయాలి

**భద్రాచలంఅర్బన్:** కృష్ణా జలాల పరిరక్షణకై నేడు నల్లగొండలో జరిగే బహిరంగ సభకు హాజరై జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల నాయకుడు ఆకోజు సునీల్ కుమార్ కోరారు. సోమవారం భద్రాచలం పట్టణంలో అంబేడ్కర్ సెంటర్‌లో కోలా రాజు అధ్యక్షతన సమావేశంలో ఆకోజు సునీల్ కుమార్ మాట్లాడారు. పోరాడి సాధించిన తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో మళ్లీ నీళ్ల పోరాటం మొదలైందని, కృష్ణా జలాలను కేంద్రానికి తాకట్టు పెట్టడం తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయటమేనని అన్నారు. కోటగిరి ప్రభోద్ కుమార్, గుంజ ఏడుకొండలు, బత్తుల నరసింహులు, లంకపల్లి విశ్వనాథ్, దన్నాన తరుణ్, చెన్నకేశవ, కొల్లిపాక శివ గుంజ బాబు,ప్రసాద్, అయినాల రామకృష్ణ, అర్జున్ పాల్గొన్నారు.

### నిబంధనలు పాటించాలి

**అన్నపురెడ్డిపల్లి:** ఎరువులు, పురుగుమందుల దుకాణాదారులు నిబంధనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి శీలం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. డీలర్లు దుకాణాల్లో ధరల పట్టికలను, ఎరువులు, పురుగు మందుల నిల్వల వివరాలను ప్రదర్శించాలన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### గంజాయిని పూర్తిగా నియంత్రించాలి

**బూర్గంపాడు:** యువత జీవితాలను సర్వనాశనం చేస్తున్న గంజాయిని ప్రభుత్వం పూర్తిగా నియంత్రించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ప్రభుత్వం గంజాయి వినియోగం, విక్రయాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# గంజాయి మత్తులో యువత

- గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు, వినియోగం
- మత్తులో అతివేగంగా డ్రైవింగ్
- తరచుగా గొడవలు



**దుమ్ముగూడెం:** మండలంలోని ప్రధాన గ్రామం లక్ష్మీనగరంలోని యువత గత కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా గంజాయికి బానిసలైనట్టు తెలుస్తోంది. గ్రామంలోని యువతకు పర్ణశాల క్రాస్ రోడ్డు, పాల్వంచ, సారపాక ప్రాంతాల నుంచి కొంతమంది యువత గంజాయి తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో రోజురోజుకూ మత్తు పదార్థాలకు బానిసలవుతున్న స్థానికుల సంఖ్య పెరుగుతోంది. లక్ష్మీనగరం గ్రామంలోనే దాదాపు 40 మంది యువత గంజాయికి బానిస అయినట్టు సమాచారం.

**అర్ధరాత్రి వరకూ రోడ్ల మీదే..**

జల్సాలకు అలవాటు పడిన కొందరు యువత రాత్రి 10గంటలు దాటిన తర్వాత కూడా రోడ్ల పైనే సంచరిస్తున్నారు. గుంపులు గుంపులుగా చేరి గొడవలకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలోనే వయసుతో సంబంధం లేకుండా ప్రతీ కుర్రాడు సిగరెట్ మాటున గంజాయి సేవిస్తూ మత్తులో తూలుతున్నాడు. నిర్మానుష ప్రదేశాలకు వెళ్లి గంజాయి సేవిస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

**పర్ణశాల క్రాస్ రోడ్డే అడ్డా..**

ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు యువత మండలంలోని పర్ణశాల క్రాస్ రోడ్డు, సీతానగరం ప్రాంతాల్లో రహస్యంగా గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నట్టు సమాచారం. పైగా ఈ ప్రాంతాల్లోనే కొందరిని విక్రయదారులుగా మార్చి స్థానికంగా యువతకు గంజాయిని మరింత చేరువ చేస్తున్నట్లు తెలుస్తోంది.

**హైస్పీడ్ బైక్‌లతో రయ్ రయ్..**

ఏజెన్సీలోని యువత హైస్పీడ్ ద్విచక్ర వాహనాలపై అడ్డూఅదుపు లేకుండా స్పీడ్‌గా వెళ్తూ పాదచారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. గ్రామాల్లో శుభకార్యాలు, జాతర సమయాల్లో యువత మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ భయాందోళనలు కలుగజేస్తున్నారు. అయితే హైస్పీడ్‌తో వెళ్తున్న యువతలో కొందరు గంజాయి ప్రభావంతోనే ఆ మేరకు వాహనాలను నడుపుతున్నట్లు స్థానికుల అభిప్రాయం. గంజాయికి అలవాటుపడి పెడదోవపడుతున్న యువతకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

**నిఘా పెట్టాం..**



యువత గంజాయి విక్రయిస్తుండటం, సేవించడంపై నిఘా ఏర్పాటు చేసి సమాచారం సేకరిస్తున్నాం. గంజాయి రవాణా చేస్తున్నప్పుడుగాని, సేవిస్తున్నప్పుడుగాని పట్టుబడితే కఠినచర్యలు తీసుకుంటాం. ఒక్కసారి పట్టుబడినా పీడీ యాక్టు కేసు నమోదు చేస్తాం. గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు. తాగిన మైకంలో గొడవలు పెట్టుకుని క్రిమినల్ కేసులు నమోదైతే చేజేతులా జీవితాలను నాశనం చేసుకున్నవాళ్లు అవుతారు.

– బొడ్డు అశోక్, దుమ్ముగూడెం సీఐ

# పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ తనిఖీ

**కరకగూడెం:** చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ పదో తరగతి స్పెషల్ ఆఫీసర్ అశోక్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి క్రమం తప్పకుండా పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. 10వ తరగతి విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం పిల్లలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు జగన్, వార్డెన్ సంపత్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారి అశోక్

# దరఖాస్తుల ఆహ్వానం

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న స్వీపర్ కం స్కావెంజర్ పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్య అధికారి సున్న సమ్మయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన వారై ఉండి ఏడో తరగతి పాసైన మహిళా అభ్యర్థులు ఈనెల 17 వరకు మండల విద్యా వనరుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

**ములకలపల్లి:** ములకలపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న రెండు స్వీపర్ కం స్కావెంజర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ, ఎండీఎం కన్వీనర్ శ్రీరామ్మూర్తి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఏడో తరగతి ఉత్తీర్ణులైన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు గల మహిళలు ఈనెల 15 వతేదీలోగా ఎమ్మార్సీలో తమ దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. బయోడేటా ఫారంతోపాటు, రెండు పాస్‌ఫొటోలు, గెజిటెడ్ అధికారితో సంతకం చేయించిన ధ్రువపత్రాలు జతచేసి ఇవ్వాలని సూచించారు.

# బదిలీ ఎంపీడీఓలకు సన్మానం



బూర్గంపాడు: ఎంపీడీఓ వివేక్‌రామ్‌ను అభినందిస్తున్న జెడ్పీటీసీ శ్రీలత తదితరులు



చంద్రుగొండ: ఎంపీడీఓలను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

**చంద్రుగొండ:** మండలకేంద్రం చంద్రుగొండలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం బదిలీ అయిన ఎంపీడీఓలను సన్మానించారు. చంద్రుగొండ ఎంపీడీఓ రేవతి, అన్నపురెడ్డిపల్లి మండల ఎంపీడీఓ అన్నపూర్ణలను శాలువాలు, పూలమాలలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్తెనపల్లి సత్యనారాయణతోపాటు వివిధ శాఖాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**బూర్గంపాడు:** బదిలీపై వెళ్తున్న స్థానిక ఎంపీడీఓ వివేక్‌రామ్‌కు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ.. రెండున్నర ఏళ్లుగా ఎంపీడీఓ వివేక్‌రామ్ మండల ప్రజలకు మెరుగైన సేవలను అందించి ప్రజల మన్ననలు పొందారని అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సునీల్‌శర్మ, ఏఈ వెంకటేశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

### జీడీపీ జిల్లా కన్వీనర్‌గా రవికుమార్

**మణుగూరురూరల్:** గోండ్వానా దండకారణ్య పార్టీ(జీడీపీ) జిల్లా కన్వీనర్‌గా ఇర్ప రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సోడే వెంకటేశ్వర్లు నియామక ఉత్తర్వులను విడుదల చేశారు. సోమవారం మణుగూరు పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో క్రియాశీలకంగా పని చేస్తానన్నారు. అనంతరం రవికుమార్‌కు గోండ్వానా దండ కారణ్య పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

### బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కేవీ రమణ

**బూర్గంపాడు:** బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బూర్గంపాడుకు చెందిన కేసుపాక వెంకట రమణ నియమితులయ్యారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో రాష్ట్ర కార్యవర్గంలో తనకు చోటు కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు,సెంట్రల్ చీఫ్ కోఆర్డినేటర్ మందా ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా సలహాదారుగా గాడిద దామోదర్‌ను నియమించినట్లు తెలిపారు.

### నిధుల మంజూరుపై హర్షం

**అశ్వాపురం:** మండలానికి పినపాక నియోజకవర్గ స్పెషల్ గ్రాంట్ నిధులు సుమారు రూ.1 కోటి 60 లక్షలు నిధులు మంజూరుపై ఎంపీపీ ముత్తినేని సుజాత హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆమె అశ్వాపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.1 కోటి 60 లక్షలతో 40 సీసీ రోడ్లు మంజూరు చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు మండల ప్రజల పక్షాన ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి



దమ్మపేట: నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న గిరిజన గురుకుల ఉద్యోగులు



మణుగూరుటౌన్: సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి షేక్ మీరా హుస్సేన్

**మణుగూరురూరల్:** తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల టీచర్ల పదోన్నతులు, బదిలీలను వెంటనే చేపట్టాలని గురుకుల జేఏసీ మల్టీజోన్ ఉపాధ్యక్షుడు వై.గమయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో గురుకుల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ ఉపాధ్యక్షుడు గమయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 20వేల మంది ఉపాధ్యాయులు గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్నారని, వీరిలో సుమారు 10వేల మంది పదోన్నతులు, జీవో నంబర్ 317 ద్వారా బదిలీలకై ఎదురుచూస్తున్నారన్నారు. రిక్రూట్‌మెంట్‌కు ముందుగానే పదోన్నతులు, బదిలీలకు చర్యలు తీసువాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఏ పద్మావతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**దమ్మపేట:** గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, గిరిజన సంక్షేమ గురుకుల ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. సోమవారం గురుకుల జేఏసీ పిలుపుమేరకు, దమ్మపేట గిరిజన సంక్షేమ గురుకుల ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. నిరసన సందర్భంగా గిరిజన గురుకుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూతకాని శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని గురుకులాలకు ఒకే రకమైన విధివిధానాలను రూపొందించాలని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని కోరారు.

**మణుగూరుటౌన్:** దీర్ఘ కాలికంగా పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మణుగూరు మండల ప్రధాన కార్యదర్శి షేక్ మీరా హుస్సేన్ డిమాండ్ చేశారు.

సోమవారం మణుగూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియలకు ప్రభుత్వం మార్గం సుగమం చేసి పదోన్నతులు బదిలీలు నిర్వహించాలన్నారు. తద్వారా ఏర్పడే ఖాళీలతో మెగీ డీఎస్సీ రీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఖాళీలు పూర్తయ్యే వరకు విద్యా వాలంటీర్లను ప్రభుత్వం నియమించడంతో పాటు పలు సమస్యలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు తోట విజయలక్ష్మి, మండల నాయకులు మీరెడ్డి ఇంద్రసేనారెడ్డి, కుమారస్వామి, త్రినాథ్, బాయమ్మ, కృష్ణమూర్తి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యశాలకు ఫర్నీచర్ వితరణ

**అశ్వాపురం:** మొండికుంట గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కందిమళ్ల సత్యనారాయణరెడ్డి రూ.50 వేలతో సోమవారం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. గత మూడు రోజుల క్రితం ఈ నెల 9న సబ్‌సెంటర్‌ను సత్యనారాయణరెడ్డి సందర్శించారు. సదుపాయాలు అరకొరగా ఉండటంతో ఫర్నీచర్ అందించారు. సమస్యలు తీర్చిన సత్యనారాయణరెడ్డిని స్థానికులు అభినందించారు. సిబ్బంది, గ్రామపెద్దలు ఆయనను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ ఏఎన్ఎం లలిత కుమారి, జూనియర్ ఏఎన్ఎం కృష్ణకుమారి, మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఇంటిలిజెన్సీ ఏఎస్సై కాసరబాద శ్రీనివాస్, ఎడ్ల ప్రతాపరెడ్డి, భిక్షంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామాచారి, ప్రభాకర్, స్థానికులు పాల్గొన్నారు.

# గృహజ్యోతి పథకంపై సర్వే

**మణుగూరురూరల్:** తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వ ప్రజాపాలన ఆరుగ్యారెంటీల్లో భాగంగా అమలు చేయబోయే మహాలక్ష్మి పథకంలో భాగమైన గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం కోసం అధికారులు సోమవారం సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధిలో సర్వే, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను ఆధార్, రేషన్, విద్యుత్ కనెక్షన్ నంబర్‌తో పాటు ప్రజాపాలన అభయహస్తం పేరుతో దరఖాస్తు చేస్తున్న వివరాలను సంబంధిత అధికారులు నమోదు చేసుకుంటున్నారు. తగు ఆధారాలతో సహకరించాలని అధికారులు కోరారు.

# విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు



అన్నపురెడ్డిపల్లి: మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

**అన్నపురెడ్డిపల్లి:** అటవీ జంతువుల వేటకు విద్యుత్ తీగలను అమర్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ జంతువుల వేటకు విద్యుత్ తీగలను అమర్చడం వల్ల పంట పొలాల పనులకు వెళ్లే రైతులు, జంతువులు షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. అటవీ జంతువుల కోసం ఎవరైనా విద్యుత్ తీగలను అమర్చితే వారి సమాచారం పోలీసులకు తెలపాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, విద్యుత్ ఏఈ సాయితరుణ్, ఎస్సై షాహీన తదితరులు పాల్గొన్నారు.

**మణుగూరురూరల్:** వేటగాళ్లు అడవి జంతువులను హతమార్చేందుకు విద్యుత్ తీగలను అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని మణుగూరు సీఐ రమాకాంత్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అడవి జంతువులను వేటాడేందుకు వేటగాళ్లు, పంట పొలాలను కాపాడుకునేందుకు రైతులు దొంగతనంగా విద్యుత్ తీగలను అమర్చడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అమర్చిన ఈ విద్యుత్ తీగలకు తగిలి జంతువులు, అమాయక ప్రజలు, అధికారులు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. దీనివల్ల ఎవరూ ఏ కారణం వల్ల కూడా విద్యుత్ తీగలు అమర్చవద్దని, లేదంటే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని సీఐ హెచ్చరించారు.

**దమ్మపేట:** విద్యుత్ తీగలను అమర్చి, అడవి జంతువుల వేటకు ప్రయత్నించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు ప్రాంతాలలో రాత్రి వేళల్లో వేటగాళ్లు విద్యుత్ తీగలను అమర్చడం వల్ల వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రైతులు, కూలీలు విద్యుత్ షాక్‌కు గురై చనిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వేటకు విద్యుత్ తీగలు అమర్చే వారి వివరాలను తెలిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు.

**అశ్వారావుపేటరూరల్:** అటవీ ప్రాంతంలో జంతువుల వేటకు అక్రమంగా విద్యుత్ తీగలను పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సోమవారం ఓ ప్రకటనలో స్థానిక ఎస్సై పి.శ్రీకాంత్ హెచ్చరించారు. అటవీ జంతువుల వేట కోసం వేటగాళ్లు పెట్టే విద్యుత్ తీగల కారణంగా సమీప పొలాలకు వెళ్లే రైతులు, మూగజీవాలు విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడుతున్న ఘటనలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. తాజాగా భూపాలపల్లి జిల్లాలో అటవీ ప్రాంతంలోకి కూంబింగ్ విధులకు వెళ్లిన ఓ పోలీస్ అధికారి మృతి చెందారని, ఇది చాలా బాధాకరమని అన్నారు. అటవీ ప్రాంతాల్లో విద్యుత్ తీగలు పెట్టే వారి వివరాలు సేకరించి కేసులు నమోదు చేస్తామన్నారు.

**అశ్వాపురం:** మండలంలో అటవీ ప్రాంతంలో అడవి జంతువుల వేటకు ఎవరైనా విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని అశ్వాపురం సీఐ జీ.రవీందర్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అడవి జంతువుల వేటకు కరెంటు తీగలు పెట్టడం వల్ల పొలాలకు వెళ్లే రైతులు, పశువుల కాపరులు, ప్రజలు, జంతువులు షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. జంతువులను వేటాడం కోసం కరెంటు తీగలు అమర్చితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జంతువుల వేటకు అక్రమంగా కరెంటు తీగలు పెడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

# సమ్మె నోటీసుల అందజేత



భద్రాచలంఅర్బన్: పీఓకు సమ్మె నోటీస్ అందజేస్తున్న బ్రహ్మచారి



అశ్వారావుపేటరూరల్: సమ్మె నోటీస్ ఎంపీడీఓకు అందిస్తున్న సీఐటీయూ నాయకులు

**భద్రాచలంఅర్బన్:** గిరిజన సంక్షేమ శాఖ పోస్టు మెట్రిక్ హాస్టల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రావలసిన 18 నెలల బకాయిలు, డైలీ వేజ్ వర్కర్లకు రావలసిన 5 నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఈ నెల 16న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మచారి మాట్లాడుతూ.. 18 నెలలుగా జీతాలు ఇవ్వకపోతే కార్మికుల కుటుంబాలు ఎలా బతుకుతాయని ప్రశ్నించారు. సమ్మె నోటీసులు అందించిన వారిలో డైలీవేజ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్, నాయకులు ముత్తయ్య, సమ్మక్క, లక్ష్మి, రాములమ్మ, పోస్ట్ మెట్రిక్ హాస్టల్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రామా, తిరుపతమ్మ, నాగమణి, దుర్గా, లాలయ్య, సరోజా తదితరులు పాల్గొన్నారు.

**దుమ్ముగూడెం:** ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మె భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ తెలంగాణ ఐకేపీ వీవోఏల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఏపీఎం హేమంతికి సమ్మె నోటీస్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ, ఐకేపీ వీవోఎల్ సంఘం జిల్లా నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల ఫిబ్రవరి 16 జరిగే గ్రామీణ బందును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వీవోఏల నాయకులు కృష్ణవేణి, కుమారి, అరుణ, నాగవేణి, శ్యామ్, వెంకట్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**అశ్వారావుపేటరూరల్:** దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన సమ్మె నోటిసును స్థానిక ఎంపీడీవో శ్రీనివాస్‌కు సోమవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక చట్టాలను అమలు చేయాలని, లేబర్ కోడ్లను రద్దు చేసి, కనీస వేతనాన్ని రూ.26వేలకు పెంచేలానే డిమాండ్‌తో ఈ నెల 16వ తేది జరిగే దేశ వ్యాప్త సమ్మెకు సహకరించాలని కోరారు. అనంతరం బిల్డింగ్ వర్కర్లతో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారావు, అప్పన్న, నందు, వెంకన్న, సరసారావు, రాంబాబు పాల్గొన్నారు.

**సమావేశాల ఏర్పాటు..**

**బూర్గంపాడు:** ఈ నెల 16న తలపెట్టిన భారతబంద్‌ను జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సారపాకలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా వామపక్షాలు, ట్రేడ్‌యూనియన్ల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ బంద్‌కు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో బత్తుల వెంకటేశ్వర్లు, శ్యామల అజయ్‌కుమార్, బయ్యా రాము , పాపినేని సరోజని,కందుకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంబీ నర్సారెడ్డి

**ములకలపల్లి:** గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అఖిలపక్ష పార్టీల సమావేశంలో పలువురు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష పార్టీల నాయకులు తేళ్ల చెన్నయ్య, నరాటి ప్రసాద్, నూపా భాస్కర్, ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, కల్లూరి కిషోర్, నరాటి రమేశ్, నిమ్మల మధు తదితరులు పాల్గొన్నారు.